




రాయదుర్గంలో ఖాళీ ప్లేట్లతో ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ఎమ్మెల్యే VS 'టు మెన్'



- పరస్పరం అధిష్టానానికి ఫిర్యాదులు
- ప్రతి పనిలో నువ్వా...మేమా...
- శింగనమల అధికార పార్టీలో గ్రూపు తగాదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గంలో అధికార పార్టీలో గ్రూపు తగాదాలు తారా స్థాయికి చేరుతున్నాయి. ఎన్నికలకు ముందు నుంచి ఈ గ్రూపు తగాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఎక్కడా లేని విధంగా శింగనమల నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జితో పాటు టుమెన్ కమిటీని వేశారు. ఈ టూమెన్ కమిటీకి, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బండారు శ్రావణీకి మధ్య పొసగలేదు. పరస్పరం కేసులు కూడా నమోదు చేసుకోవడం జరిగింది. ఈ గొడవల మధ్యనే ఎన్నికలు జరగడం... బండారు శ్రావణి ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగాయి. టిడిపి అధికారంలోకి వచ్చాక కూడా ఈ నియోజకవర్గంలో టుమెన్ కమిటీకి, ఎమ్మెల్యే బండారు శ్రావణికి మధ్య ప్రతి విషయంలోనూ తగాదాలు నడుస్తూనే ఉన్నాయి. నువ్వా... మేమా అన్నట్టుగా వ్యవహారాలు నడుస్తున్నాయి.


మూడు రోజుల క్రితం బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్ వద్ద వాదులాడుకుంటున్న టిడిపి మద్దతుదారులు (ఫైల్‌ఫోటో)

రచ్చకెక్కి అధిష్టానంకు పరస్పరం ఫిర్యాదులు

ఈ రెండు గ్రూపుల పంచాయతీ అధిష్టానం పెద్దల వద్దకు చేరుతోంది. టుమెన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారు శ్రావణిపై టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో తమ బంధువులతో వ్యవహారాలు చక్కబెడుతున్నారని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీనికి ప్రతిగా ఎమ్మెల్యే మద్దతుదారులు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు టుమెన్ కమిటీపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేగా బండారు శ్రావణి ఉండగా టుమెన్ కమిటీ పెత్తనం నియోజకవర్గంలో ఏమిటని ఆయన ముందు తమ వాదనలు వినిపించడం గమనార్హం. ఎన్నికల్లో ఈ కమిటీకి మద్దతుదారులు కొంత మంది పార్టీకి వ్యతిరేకంగానూ పనిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యేకి అధికారాలుంటయా లేదా అని అధ్యక్షుడిని అడిగారు. ఇలా రెండు గ్రూపులు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటూ ఉండటం గమనార్హం.

ప్రతి పనిలోనూ పోటాపోటీ

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పనులేమైనా జరుగుతాయని నియోజకవర్గంలోని టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పోటీపడుతున్నారు. గ్రూపులతో ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయంలో పడుతున్నారు. అంతేకాకుండా ప్రతి పనిలోనూ వీరి తరుపున రెండు గ్రూపుల మధ్య పోటీ కొనసాగుతోంది. ఈ రకంగా పోటీ పడుతూ రెండు రోజులక్రితం బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్ ఎదుటే రెండు గ్రూపుల మధ్య వివాదం చోటు చేసుకోవడం గమనార్హం. మట్టి తవ్వకాల విషయంలోనూ రెండు గ్రూపులు పోటీలుపడి సవాళ్లు విసరుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే తరుపున మద్దతుదారులు పోటీపడుతుండగా, అందుకు ప్రతిగా టుమెన్ కమిటీ మద్దతుదారులు పోటీపడుతున్నారు. ఇలా ఇద్దరి మధ్య పోటీలతో అనుకున్న పనులు ముందుకు సాగడం లేదన్న అభిప్రాయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

'మధ్యాహ్న భోజనం' కోసం...

- జూనియర్ కళాశాల విద్యార్థుల ఆందోళన
- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఖాళీప్లేట్లతో నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

గత టిడిపి ప్రభుత్వంలో జూనియర్ కళాశాలల్లో అమలైన మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలోని కనేకల్ రోడ్డుపై ఖాళీ ప్లేట్లతో బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ విషయంపై రాష్ట్రంలోని అందరు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందిచామన్నారు. అయినా ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై అసెంబ్లీలో మాట్లాడకపోవడం విచారకరం అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దీనిని రద్దు చేశారన్నారు. ప్రస్తుతం అదే పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఈ పథకాన్ని పునఃప్రారంభించి విద్యార్థుల ఆకలి తీర్చాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకం అమలు చేసే వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని, అవసరమైతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడికి సైతం వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్, గౌతమ్, అనిల్, సందీప్, భానుప్రకాష్, విష్ణు, తిప్పేసి, శివారెడ్డి, సందీప్, వంశీ, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించాలన్నారు. పామిడి పట్టణంలో బిసి బాలికల కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో ఇంటర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రస్ట్‌లో విద్యార్థినులపై వేధింపులు

నిర్వాహకుని కుమారుడికి దేహశుద్ధి.?

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నె మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఓ ట్రస్ట్‌లో విదార్థునులను వేధిస్తున్న ఘటన వెలుగు చూసింది. విద్యార్థినుల ఫిర్యాదు మేరకు తల్లిదండ్రులు ట్రస్ట్ వద్దకు చేరుకుని వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల కేంద్రంలోని రైల్వేగేట్‌కి సమీపంలో ఓ వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా క్రిస్టియన్ నిధులతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నాడు. ఇక్కడ 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తూ, చదువుకు కావాల్సిన పుస్తకాలను ఇతర విద్యాసామగ్రి అందిస్తున్నారు. అయితే గత ఆరు నెలలుగా ట్రస్ట్ నిర్వాహకుని కుమారుడు ట్రస్ట్‌లో చదువుతున్న బాలికలను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై శుక్రవారం నాడు హాస్టల్లోని బాలికలు వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో బాలికల తల్లిదండ్రులు ట్రస్టు దగ్గరకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు చెప్పినవన్నీ వాస్తవం అని తేలడంతో నిర్వాహకుడు కుమారుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. కాగా దీనిపై ఇప్పటి వరకు పోలీసులు ఇంకా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఘటనపై గార్లదిన్నె, శింగనమల, అనంతపురం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం తెలిసే అవకాశం ఉంది.

కార్గిల్ యుద్ధవీరుల త్యాగం మరువలేనిది


కార్గిల్ యుద్ధవీరులు, మాజీ సైనికులతో గ్రూఫ్ ఫొటో దిగుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

కార్గిల్ యుద్ధవీరుల త్యాగం, ధైర్య సాహసాలు అసామాన్యమని, సమాజంలో అందరికీ వారు స్ఫూర్తి దాయకమని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవం సందర్భంగా రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో శుక్రవారం నాడు అనంతపురం కలెక్టర్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్లో కార్గిల్ యుద్ధ వీరులు, మాజీ సైనికులను కార్గిల్ విజయ్ దివస్ మెమెంటో, పుష్ప గుచ్ఛాలతో కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 1999 మే నెల 3 నుంచి దాదాపు 60 రోజుల పాటు అత్యంత ఎత్తైన, మైనస్ టెంపరేచర్ ఉన్న అతిశీతల మంచు కొండలైన ద్రాస్, కార్గిల్ యుద్ధ విధుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం పరిధి నుంచి దాదాపు 30 మందికి పైగా యుద్ధ వీరులు, మాజీ సైనికులు పాల్గొన్నారన్నారు. వారు ప్రాణాలకు తెగించి చేసిన త్యాగం గొప్పదన్నారు. మాజీ సైనికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం జిల్లా సైనిక సంక్షేమ శాఖ ద్వారా ఎప్పుడూ అందుబాటులో ఉంటామని తెలియజేశారు. నేటి యువత సైనికులను స్ఫూర్తిగా తీసుకుని దేశ రక్షణలో భాగంగా సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో స్వీయ అనుభవాలు, అక్కడ జరిగిన యుద్ధం, విజయంపై కెప్టెన్ ఉమామహేశ్వర రావు, హవల్దార్ రమేష్ కుమార్ రెడ్డి, సార్జంట్ సంజీవ తదితరులు సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, కార్యాలయ సిబ్బంది, కార్గిల్ యుద్ధవీరులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో పరిశ్రమలను స్థాపించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రోత్సాహం అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు సృష్టించే తయారీ మరియు సేవారంగ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిశ్రమల అనుమతలకు దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి, నిర్ణీత సమయంలోగా అనుమతులు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లాలో 2015-20 ఇండస్ట్రియల్ పాలసీలో 3 యూనిట్లకు రూ.17.88 లక్షల సబ్సిడీ, 2020-23 ఇండస్ట్రియల్ పాలసీలో 3 యూనిట్లకు రూ.7.46 లక్షలు, 2023-27 ఇండస్ట్రియల్ పాలసీలో 16 యూనిట్లకు రూ.147.67 లక్షల సబ్సిడీ మంజూరు చేసేలా సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.నాగరాజారావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు చర్యలు

ప్రభుత్వ వైద్యాధికారి పివి.అనికేథ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

కుష్టు వ్యాధి నివారణ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ వైద్యాధికారి పివి అనికేత్ అన్నారు. శుక్రవారం ఉరవకొండ మండలం పెద్దకౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నింబగల్ గ్రామంలో డాక్టర్ పి.వి అనికేత్ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి నివారణలో భాగంగా జులై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ 'కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఒక ఆశా కార్యకర్త, మగ వాలంటీర్ కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నట్లు తెలిపారు. చర్మంపై పాలిపోయిన, రాగి వర్ణంలో ఉన్న స్పర్శ లేని మచ్చలు, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోవడం, ముఖమంతా నూనె రాసినట్టు ఉండటం, ముక్కు అనిగి ఉండడం, ముఖం, చెవులపై చిన్న చిన్న బుడిపెలు లాంటి నిర్మాణాలు ఉండడం, శరీరంపై మానని గాయాలు ఉండడం, చెప్పులు సరిగా ధరించలేకపోవడం, రిస్ట్ డ్రాప్ ఉండడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఎంపిహెచ్‌ఇఒ గోవిందు, ఆరోగ్య సహాయకుడు, ఎం.ప్రసాదరావు, ఏఎన్ఎం నాగమ్మ, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి పివి అనికేథ్


పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం, అధికారులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 42, 48వ డివిజన్ల పరిధిలో మేయర్ మహమ్మద్ వసీం పర్యటించారు. ఇందులో భాగంగా పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాత మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ బాల్స్ వేయడం వల్ల దోమలు ఉత్పత్తి కాకుండా ఉంటాయన్నారు. నగర పరిధిలో వర్షం నీరు, మురుగునీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం ఫాగింగ్ చేపట్టడంతో పాటు మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య మెరుగుకు ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. బైపాస్ రోడ్డులో డ్రెయినేజీ చెత్తతో నిండిపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లకుండా నిలబడడంతో ప్రజలు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని వెంటనే గ్యాంగ్ వర్క్ ద్వారా కాలువ శుభ్రం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, రహంతుల్లా, కమల్‌భూషణ్, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, డాక్టర్ కావ్య, మలేరియా నిర్మూలన అధికారి మద్దయ్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖకు మంచిపేరు తీసుకొద్దాం

ఎస్పీ కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ప్రజలకు జవాబుదారీ తనంతో పని చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా విధులు నిర్వహించాలని ఎస్పీ కెవి.మురళీకృష్ణ సూచించారు. పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నాడు ఎఆర్ సాయుధ బలగాలు, హోంగార్డులు నిర్వహించిన పరేడ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యూనిఫాం సర్వీస్‌లో ఎఆర్, హోంగార్డులు సివిల్ పోలీసులతో పాటు ప్రాధాన్యతగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రిజినర్స్ ఎస్కార్ట్, గార్డు విధులతో మొదలుకుని అన్నిరకాల విధులు అంకితభావంతో అందరికీ సమాన విధులు ఉండేలా చూసి, పని ఒత్తిడి తగ్గించేందుకు కషి చేస్తామన్నారు. పోలీసుశాఖకు చెడ్డపేరు తెచ్చేవిధంగా ఎవరూ ప్రవర్తించరాదన్నారు. విధుల్లో ఉన్నప్పుడు పోలీసుశాఖ ప్రతిష్ట పెరిగేలా మసలుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సివిల్, ఎఆర్ పోలీసులు సమిష్టిగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఇక ఆరోగ్యం మెరుగదల, ఫిజికల్ ఫిట్నెస్ కోసం ప్రతిరోజూ శారీరక వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం ఎఆర్, హోంగార్డులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, ఎఆర్ డీఎస్పీ మునిరాజ, ఆర్‌ఐలు మధు, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, జిల్లా సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, పలువురు ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ఎడిఎ వెంకటరాముడు

ప్రజాశక్తి-పామిడి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడిఎ వెంకటరాముడు

రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి అధిక దిగుబడి పొందాలని ఎడిఎ వెంకటరాముడు సూచించారు. శుక్రవారం మండలంలోని కండ్లపల్లి రైతు సేవాకేంద్రంలో మండల వ్యవసాయాధికారిణి లీలా వసుంధర అధ్యక్షతన పొలంబడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, ఆరోగ్యకరమైన పంటలను పండించాలన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. పశువుల పేడ వేయడం ద్వారా నేలలో గర్భం నిల్వలను పెంచవచ్చన్నారు. అంతేగాకుండా మట్టి నమూనాల సేకరణ, మట్టి నమూనాలను పరిశీలించి వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. అనంతరం వేరుశనగ, కంది, కొర్ర, వరి, తదితర పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుల పుల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీరామిరెడ్డి, అధికారులు శ్రీనివాసరావు, వర్ష రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు రద్దు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

కదిరిదేవరపల్లి నుంచి రాయదుర్గం మీదుగా తిరుపతికి వెళ్లే (రైలు సంఖ్య 07589/07590) ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 1వతేదీ వరకూ పాక్షిక రద్దు గడువును పొడిగించనున్నట్లు నైరుతి రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమార్గంలో రైలు మార్గం మరమ్మతులు కొనసాగుతున్న కారణంగా జనవరి 1 నుంచి జూలై నెలాఖరు వరకూ రైలును పాక్షికంగా రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే మరమ్మతులు పూర్తికానందున మరో నెలరోజులపాటు పాక్షిక రద్దు గడువును పొడిగించనున్నట్లు తెలిపారు.


30న ఎల్‌సి 24 గేటు మూసివేత

డి.హీరేహాల్ మండలం సోమలాపురం-ఓబులాపురం రైల్వేస్టేషన్ నడుమ సోమలాపురం వద్ద ఉన్న లెవెల్ క్రాసింగ్ 24 గేటును ఈనెల 30న మూసివేయనున్నట్లు నైరుతి రైల్వే బళ్లారి సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రుద్రేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గేటు వద్ద ఓవర్ హాల్టింగ్, వార్షిక నిర్వహణ మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

తాగు, సాగునీరు అందించాలి

మంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే, పుట్లూరు నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు


మంత్రి నిమ్మల రామానాయుడుకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, నాయకులు

కడప జిల్లా గండికోట జలాశయం నుంచి పుట్లూరు మండలంలోని సుబ్బరాయసాగర్, పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి, బొప్పేపల్లి చెరువులకు నీరు తీసుకొచ్చి తాగు, సాగునీటి కష్టాలను తీర్చాలని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మాజీ మండల శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో డిపిఆర్ పూర్తి పేపర్‌కే పరిమితమైందన్నారు. కావున ఇప్పుడైనా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మండల నాయకులు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఘనంగా వృద్ధుల దినోత్సవం



వృద్ధులకు మొమెంటో అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రామచంద్రనగర్‌లో ఉన్న సెయింట్ అగస్టీన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ ఇంట్లో ఉన్న తల్లిదండ్రులే బరువు అనుకుని అనేకమంది వృద్ధాశ్రమాల్లో వదులుతున్నారన్నారు. వృద్ధులకు అండగా ఉండాల్సిన వయసులో వారి బాగోగులను ఏమాత్రం పట్టించుకోకుండా ఆశ్రమాలకు పరిమితం చేయడం మంచిది కాదన్నారు. వృద్ధుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో తమ మనవరాలు, మనమళ్లు చదువుతురన్నాన్నారు. వీరితోపాటు వీరి తల్లిదండ్రులు కూడా ఇదే పాఠశాలలోనే చదివారన్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎందరో ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. అలాంటి పాఠశాలలో సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం 7వ తరగతి విద్యార్థులు తల్లిదండ్రులపై ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల పరిపాలన విభాగం అధిపతి సంధ్య, తెలుగు మీడియం కరస్పాండెంట్ మేరీ, ఉపాధ్యాయులు, వృద్ధులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

వ్యవసాయ శాఖ అధికారి మద్దులేటి



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి మద్దులేటి

ప్రజాశక్తి-శింగనమల

రైతులు శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు సూచనలు పాటించి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఎడిఎ మద్దులేటి సూచించారు. శుక్రవారం మండలంలోని సలకంచెరువు, రాచేపల్లి రైతు సేవాకేంద్రాల్లో పంట సాగుదారుల ధ్రువీకరణ పత్రాలు, పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరి వరకూ వేరుశనగ పంటను సాగు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు మొదటి వారం వరకూ కంది పంట సాగు చేయవచ్చన్నారు. తర్వాత కూడా పెసర, ఉద్ది, కొర్ర, ఉలవ వంటి పంటలను సాగు చేయవచ్చన్నారు. ముఖ్యంగా ఏపంట సాగు చేసినా విత్తన శుద్ధి తప్పనిసరి అన్నారు. కాగా కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డులను తీసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం పథకాలకు అర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ శైలజ, ఎఇఒ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, విహెచ్ఎ రాజేశ్వరి, ఎంపిఇఒ జయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామచంద్రుడు, పరశురాముడు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నాసా, ఇస్రో పోటీల్లో 'శ్రీచైతన్య' విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఎజిఎం, అధ్యాపకులు

అనంతపురం : నాసా, ఇస్రో పోటీల్లో నగరంలోని శ్రీచైతన్య పాఠశాల ఐపిఎల్ క్యాంపస్ విద్యార్థిని కార్తికేయ సాయి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మూడు లక్షల మంది విద్యార్థులకు పైగా పాల్గొన్న అమేజాన్ వెబ్ సర్వీసెస్ కాంపిటీషన్ నాసా, ఇస్రో వంటి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తెలుగు నేల, జిల్లా కీర్తి, ప్రతిష్టను కార్తికేయ సాయి ఇనుమడింపజేయడం గర్వకారణమన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఖలందర్, సతీష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌పట్నాయక్, కోఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నార్పల విద్యార్థి



రాష్ట్రస్థాయికి ఎంపికైన మున్నా

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మున్నా రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ విభాగంలో రాష్ట్ర జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, నసీమా బేగం తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధుల నివారణ

గుత్తి : వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు దరి చేరవని శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సీఇఓ ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్ఆర్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఉంటున్న పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రంగస్వామి రెడ్డి, స్వరూప, చంద్రశేఖర్, యాగంటి ప్రకాష్ బాబు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన 'దేగల'

శింగనమల : జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణ మూర్తి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు వారి వారి వారి కార్యాలయాల్లో కలిసి సమస్యలపై చర్చించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెద్దవడుగూరు : పత్తిపంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పత్తి, ఇతర పంటలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 8730 హెక్టార్లలో పత్తిపంట, 540 హెక్టార్లలో వేరుశనగ పంటలను సాగు చేసినట్లు తెలిపారు. సాగు చేసి 45 రోజులు అవుతుండటంతో రైతులు పత్తిపంటలో చీడపీడలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు అంశాలపై చర్చించారు. అనంతరం రైతు సేవా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

చెట్లే జీవకోటికి ఆధారం

వజ్రకరూరు : చెట్లే జీవకోటికి ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి మానవ మనుగడను కాపాడాలని విడపనకల్ మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని హవలిగి, పాల్తూరు గ్రామాల్లో ఉన్న రైతు సేవాకేంద్రాల వద్ద మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత అనంత జిల్లాగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. అనంతరం కౌలు రైతులకు కౌలుదారు హక్కు పత్రాలు పొందే విధి విధానాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దేవరాజు, వీఆర్వో రవితేజ, ఎంపిఇఒలు ముత్యాలు, మెర్సీ, పోలీసులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్‌దివస్ ర్యాలీ



అనంతపురంలో కార్గిల్ విజయ దివస్ ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

కార్గిల్ విజయ్‌దివస్ 26వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించడం చాలా గర్వంగా ఉందన్నారు. నేటి యువత కూడా దేశం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. తిమ్మప్ప మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో దాదాపు 527 మంది సైనికులు వీరమరణం పొందడం బాధాకరమన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి రంగనాథ్, ఎన్ఎస్ఎస్ విష్ణుప్రియ, బృందా, గవర్నమెంట్ హై స్కూల్ ఎన్‌సిసి నాగేంద్ర, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, గొల్ల ఈశ్వరయ్య, సంజీవకుమార్, జంగంశెట్టి సురేష్, మహమ్మద్‌గౌస్, హుస్సేన్, తలమర్ల కృష్ణ, మణికుమార్, పెంచలయ్య, సుబ్రమణ్యం, సిద్ధన్న, నాగరాజు, బాబా, శివశంకర్, మహమ్మద్ ఇర్షాద్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ సైనికులు ఈశ్వరయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్, ఎన్‌సిసి అధికారి వై.రామాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణశాస్త్రి, ఆర్మీ జవాన్ సురేంద్ర, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధ వీరుడికి సన్మానం

గుత్తి : కార్గిల్ యుద్ధ వీరుడికి శుక్రవారం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సన్మానం చేశారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో శత్రుదళాలపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ప్రతి ఏటా కళాశాలలో కార్గిల్ విజయ దివాస్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గుత్తి పట్టణంలో నివాసం ఉంటున్న కార్గిల్ యుద్ధవీరుడు నాయబ్ సుబేదార్ జింక రామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సేవ చేసేందుకు యువకులు భారత సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీ.వాణి, ఎండి జి.రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ అధికారి రాజేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాలను తగ్గించాలి



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న సుజాత

ప్రజాశక్తి-బెలుగుప్ప

మాతా,శిశు మరణాల తగ్గించేందుకు వైద్యులు, వైద్యసిబ్బంది కృషి చేయాలని ఎఫ్‌డిపి నోడల్ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉనన 'ప్రసవం సురక్షితం' ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులోభాగంగా కేంద్రంలోని పరికరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు తగ్గించడానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా కీటక జనిత వ్యాధుల నిర్మూలన గురించి గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రతి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ ఎం.రవిశంకర్, వైద్యసిబ్బంది డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక, శ్రీరంగపురం ప్రభుత్వ వైద్యాధికారి లోకేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, వసంత, రాంబాబు, విజయ్, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

27న ఐటిఐలో ప్రవేశానికి అడ్మిషన్లు

అనంతపురం : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఐటీల్లో ఈనెల 27వ తేదీ నుంచి రెండవ దఫా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఐటిఐ బాలుర కళాశాల ప్రిన్సిపల్ చెన్న రామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో ఏ కోర్సు అప్లై చేసుకున్నా కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చన్నారు. హాజరయ్యే విద్యార్థులు తమవెంట తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణత మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువపత్రాలను తీసుకురావాలని కోరారు.

'పుట్టినిల్లు'కు విరాళం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ సంస్థ చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలు గుర్తించిన అనంతపురం రెవెన్యూ కాలనీలోని ఆశ్రమంలో ఉంటున్న విశ్రాంత ఉద్యోగి విరూపాక్షయ్య శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి మాట్లాడుతూ ఆశ్రమానికి సహాయ, సహకారాలు అందించిన విరూపాక్షయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు పెద్దవారు తదితరులు పాల్గొన్నారు.

'హరిత అనంత'ను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు రూరల్ : హరిత అనంత కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కె.స్వాతి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని దోనముక్కల, కసాపురం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కౌలు రైతుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూమిని కౌలుకు చేసే రైతు యజమాని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతోపాటుగా సాగు చేసే రైతు ఆధార్ కార్డు, పాస్ ఫొటో తీసుకొచ్చి సిసిఆర్‌సి కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా అనంత హరిత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పంపిణీ చేసే ఎర్రచందనం, టేకు, గంధం మొక్కలను నాటుకుని రైతులు అధిక ఆదాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది భార్గవ్, తిరుపాలు, కసాపురం వీఆర్వో పవన్‌స్వామి, రైతులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపప్పూరు : జిల్లాలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రామకోటి కాలనీలో ఉన్న చౌడేశ్వరి ఆలయ ఆవరణలో చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది కార్మికులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వారందరికీ గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.24వేలను టిడిపి ప్రభుత్వం కూడా చేనేతల ఖాతాలకు జమ చేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం జిల్లా జౌళి శాఖ అధికారి అప్పాజీ, శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు చింతా పురుషోత్తం, చేనేత కార్మికులు చింతా వెంకటరమణ, జి.ఓబులేసు, సి.రమేష్, బి.వెంకటరాముడు, డి.రామాంజనేయులు, శ్రీనివాసులు, హరిప్రసాద్, వెంకటరాముడు, వేణుగోపాల్, కేశవ, నాగేశం, తదితరులు పాల్గొన్నారు.

బాలాపురంలో ఫ్రైడే డ్రైడే

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఫ్రైడే డ్రైవ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ ప్రజలకు డయేరియా, పరిసరాల పరిశుభ్రతప అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలాపురం పంచాయతీ సెక్రటరీ పి.వెంకట్‌నాయుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని శీర్పి గ్రామ పంచాయతీలో ఉన్న పలు కాలనీల్లో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉన్న వాటిని ఖాళీ చేయించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, విద్యా సంక్షేమ సంచాలకులు సాయిశ్రీ, గ్రామ పశువర్ధక సహాయకులు సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

'పివికెకె'లో ప్రాంగణ నియామకాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో పివికెకె సిబ్బంది

అనంతపురం : స్థానిక రుద్రంపేటలో ఉన్న పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ (24)7 ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రాంగణ నియామకాల్లో బీటెక్, డిగ్రీ పూర్తి చేసిన సుమారు వంద విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 10 మంది వార్షిక వేతనం 3.25 లక్షలతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ పల్లెకిషోర్, కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.భానుకిరణ్, ఎఒ మనోహర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు సల్మాన్‌అహ్మద్, జావేద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గ్రీవెన్స్' : ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లాలోని పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కెవి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 45 మంది పోలీసు సిబ్బంది వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఇందులో బదిలీలు, సస్పెన్షన్ రీవోక్, ఇతర సమస్యలపై సిబ్బంది పిటీషన్లు అందజేశారు. సర్వీస్ రూల్స్ ప్రకారం పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్పీ సి.ఐ ఇందిర, జిల్లా పోలీసు కార్యాలయ ఏఒ శంకర్, సూపరింటెండెంట్లు ప్రసాద్, సావిత్రి, ఎస్పీ సిసి ఆంజనేయప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులునాయుడు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కాటాలకు ముద్రలు

పామిడి : స్థానిక భోగేశ్వరస్వామి ఆలయంలో లీగల్ మెట్రాలజీ, తూనికలు కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ కాటాలకు శుక్రవారం ముద్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తూకం రాళ్లు, కాటాలను ఏడాదికోసారి తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయదుర్గం : పట్టణంలోని 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మాజీ సర్పంచి మృతి

బెలుగుప్ప : మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి చిప్పగిరి నాగిరెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారితో వైసిపి నాయకులు ఇరుపాపల్లి మచ్చన్న, శివలింగప్ప, నరిగన్న, ఎర్రిస్వామి ఉన్నారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం

పామిడి : ఆషాఢమాసం 3వ శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగ అమ్మవారిని వివిధ ఆకుకూరలు, కూరగాయలు, పళ్లతో అలంకరించారు. తర్వాత అర్చకులు రఘునాథశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో నిర్వహించిన బీటెక్ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.23) రెగ్యులర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు కళాశాల అకడిమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.లలితకుమారి, వివిధ విభాగాల ఆధిపతులు భువనవిజయ, కెఎఫ్.భారతి, కళ్యాణిరాధ, ఎం.రామశేఖరరెడ్డి, దిలీప్‌కుమార్, జి.మమత, అజిత, తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన సంగా తేజస్విని

అనంతపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సచివాలయంలో సిఎం ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ముఖ్యంగా జిల్లాలోని పలు విషయాలను సంగా తేజస్వినిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.



చంద్రబాబుతో మాట్లాడుతున్న సంగా తేజస్విని

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బొమ్మనహాల్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇఒఆర్‌డి దేవదాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొలగానహళి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి శివయ్య అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే వేస్ట్ ఆయిల్‌ను చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచితోపాటు వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు అనంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా హొన్నూరుస్వామి

బొమ్మనహాల్ : వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా హొన్నూరుస్వామిని నియమించారు. శుక్రవారం జిల్లా వాల్మీకి సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా హొన్నూరుస్వామిని మాజీ సర్పంచి కేశప్ప ప్రతిపాదించగా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. ఈ కార్యక్రమంలో దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన వాల్మీకులు పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం : రాయదుర్గంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం సివిల్, మెకానికల్ బ్రాంచిల్లో అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసై ఆసక్తి ఉంటే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్లు జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ ఫొటోలతో తన కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మొక్కలు నాటిన అధికారులు

గార్లదిన్నె : వన మహోత్సవంలో భాగంగా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

28న పుస్తకాల ఆవిష్కరణ

అనంతపురం : ప్రముఖ కవి, సాహితీవేత్త మల్లెల నరసింహమూర్తి రచించిన రెండు కావ్యాలను ఆదివారము స్థానిక ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఆడిటోరియం హాల్‌లో ఆవిష్కరించనున్నట్లు విమలా శాంతి వ్యవస్థాపకులు డాక్టర్ శాంతి నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లెల నరసింహమూర్తి చాలాకాలం తర్వాత ఒకేసారి 'మాకూ ఒకనది కావాలి', 'మట్టి తంబూర' అనే రెండు ఉత్తమ కవితా సంపుటాలను మనకు అందిస్తున్నట్లు

నేరాలు ఘోరాలు

గోవా మద్యం పట్టివేత



మద్యం వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

రాయదుర్గం : మండలంలోని 74 ఉడేగోళం జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి భారీగా గోవా మద్యాన్ని పట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం రాయదుర్గంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గోవా నుంచి తెలంగాణలోని నాచారానికి ఫినోలెక్స్ కేబుల్ తీసుకెళ్తున్న ఐచర్ వాహనంలో సుమారు 147 పెట్టెల్లో గోవా మద్యాన్ని తరలిస్తుండగా సెబ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం వాహనాన్ని నడుపుతున్న వంశీకృష్ణ, త్రినాథ్‌రెడ్డిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం, ఫినోలెక్స్ కేబులు, వాహనం విలువ రూ.80లక్షలు ఉంటుందని ఎస్పీ వివరించారు. పరారైన మరో ఇద్దరూ ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్స్ నిర్వాహకుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మద్యం పట్టుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ విజయలక్ష్మి, ఇంటెలిజెన్స్ సీఐ కృష్ణ, రాయదుర్గం సెబ్ సిఐ మురళీమోహన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి నగదు రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, ఎఇఎస్ శ్రీరామ్, సిఐలు వెంకటలక్ష్మి, మురళీకృష్ణ, మురళీమోహన్, ప్రసాద్‌రావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

రాయదుర్గం యుపిఎస్, రూరల్ పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ కెవి.మురళీకృష్ణ తనిఖీ చేశారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వాహనాల తనిఖీలు తప్పకుండా నిర్వహించాలన్నారు. నేరాలను అరికట్టేందుకు గస్తి ముమ్మురం చేయాలని సూచించారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కర్నాటక మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



బోయ రాముడు (పాతచిత్రం)

రాయదుర్గం : మండలంలోని రాతిబావివంక గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బోయ రాముడు (40) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రాముడు మధ్యాహ్నం పొలంలో విద్యుత్ మోటారు వేసేందుకు వెళ్లగా మోటారు ఆన్ చేస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



నాగరాజు (పాతచిత్రం)

మండలంలోని బిఎన్.హళ్లి గ్రామంలో ఉన్న గవి సిద్దేశ్వర స్టీల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న నాగరాజు (60) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. విధి నిర్వహణలో నాగరాజు చనిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే అతడు విధుల్లో లేడని, అనారోగ్య కారణాలతో చనిపోయినట్లు ఫ్యాక్టరీ నిర్వాహకులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పి.మహేష్ అదృశ్యమైనట్లు తండ్రి పి.రాముడు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పి.మహేష్ దాదాపు రెండు నెలల క్రితం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువులు, పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మృతుడికి 9నెలల క్రితం వివాహమైంది.

విద్యుత్ మోటార్ల చోరీకి విఫలయత్నం

గుత్తి : పట్టణంలోని పోలీస్ క్వాటర్స్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం విద్యుత్ తాగునీటి మోటార్లను దొంగలించేందుకు ప్రయత్నించిన ఓ దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణానికి చెందిన ఓ మెకానిక్ గతంలో తాను నివాసం ఉండే ఇంటిలో మరమ్మతులకు వచ్చిన విద్యుత్ తాగునీటి మోటార్లను ఉంచేవాడు. అది గమనించిన ఓ దుండగుడు ఆ ఇంటి తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.25వేలు విలువజేసే విద్యుత్ తాగునీటి మోటార్లను దొంగలిస్తుండగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. గతంలో కూడా నాలుగు విద్యుత్ తాగునీటి మోటార్లు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. దొంగను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నగదు చోరీ

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన కురకుల అదినారాయణ ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఆదినారాయణ ఈనెల 24న పీర్ల పండుగ నిమిత్తం శింగనమలలోని తన చిన్నాన్న ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలోని రూ.81వేల నగదును దోచుకెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చిన ఆదినారాయణ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.